
# మేడ్ ఫర్ ఈచ్ అదర్

గురజాడ శోభా పేరిందేవి



''పెళ్లి కొడుకు నీతో మాట్లాడతాడట'' పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పింది నాణ్యతో ఆమె పిన్ని కూతురు.

నాణ్య బుగ్గలు ఎర్రబడ్డాయి. ఆరోజు తెల్లవారు జామునే పెళ్లయింది. రాత్రికి శోభనానికి అన్నీ అమర్చే హడావుడిలో వున్నారు ఆడపెళ్లివారు. ఆ హడావిడిలో అంత మంది ముందు అతడు వచ్చి తనతో మాట్లాడతాడు అన్న ఊహ నాణ్యని ఇబ్బంది పెట్టింది.

''అక్కా పెళ్లికొడుకు డాబా మీద కూర్చున్నాడు. నువ్వు తన దగ్గరికి వచ్చేదాకా నీ సెల్‌కి ఫోన్ చేస్తూ ఎస్సెమ్మెస్‌లు ఇస్తూ వుంటాడట''అనేసి వెళ్లిపోయింది ఆ పాప.

వెళ్లలా వద్దా అనే విషయం నాణ్య తేల్చుకునేలోగానే ఆ వార్త పందిట్లో వున్న వారందరికి తెలిసిపోయింది. అందరూ నాణ్యని అల్లరిపెట్టసాగారు.

''మీ అల్లరి భరించే కంటే మా ఆయన దగ్గరకి వెళ్లడం నయం'' అని కొంటెగా అని డాబా మెట్లెక్కింది నాణ్య.

అందంగా పెళ్లికళతో మెరిసిపోతున్న అవ్యయ్ "రా! ఇలా వచ్చి కూర్చో!" అన్నాడు.

నాణ్య అతనికెదురుగా పిట్టగోడ మీద కూర్చుంది.

"ఇవాళ మన ఫస్ట్ నైట్ కదా!" అన్నాడు.

అతను అంత సూటిగా ఆ మాట అనేసరికి నాణ్య ముఖం ఎర్రబడింది.

"నేను మన ఫస్ట్ నైట్ గిఫ్ట్‌గా నీకు డైమండ్ సెట్ ఇవ్వబోతున్నాను.

"....?"

"నువ్వు నాతో సంసారం చెయ్యలేవు తప్ప సమస్యలేవీ లేకుండా జీవితాన్ని గడపగలవు అన్నాడు అవ్యయ్.

నాణ్య అయోమయంగా అతని వైపు చూసింది.

"ఒక రోడ్డు ప్రమాదంలో నేను నా మగతనాన్ని కోల్పోయాను. అందుకే పెళ్లి చేసుకునే ఉద్దేశాన్ని మానుకున్నాను. కానీ మా వాళ్లు నన్ను వదిలిపెట్టలేదు. ఏ లోపమున్నా మగాడి విషయంలో అది లోపమే కాదంటూ నీకు తాళి కట్టించారు. ఇంక మన జీవితాలు ఒకే ఇంట్లో కొనసాగుతాయి కనుక నిజాయితీగా నీకీ నిజాన్ని చెప్పాను" అన్నాడుఅవ్యయ్.

నాణ్య మనసు భగ్గుమంది.

అంత నిజాయితీయే వున్నవాడైతే పెళ్లి ముందే చెప్పవచ్చుగా! ఇప్పుడు చెప్పడం జరిగితే ఇంక ఏ ఆడపిల్లైనా చచ్చినట్లు పడి వుంటుంది అన్నది అతగాడి భావమన్నమాట. చేసిన అన్యాయం సొంతం చేసేసి వజ్రాల నగలతో వంచించబోతున్నాడన్న మాట.

నాణ్య అతనితో ఏమీ మాట్లాడలేదు. చరచరా కిందికి నడిచి వచ్చేసింది.

★★★

నాణ్య పెళ్లి పెటాకులై నాలుగుసంవత్సరాలైంది. ఆమెని చూసి చెవులు కొరుక్కునేవారు కళ్లతో మాట్లాడుకునేవారు, మూతులు తిప్పే వారూ ఎందరో వున్నారని తెలుసు కనుక ఎవ్వర్నీ కలవకుండా తన చేసే ఉద్యోగానికి పూర్తి న్యాయం చేస్తూ ఇల్లు, ఆఫీసే తన ప్రపంచంగా మలుచుకుంది నాణ్య.

ఆఫీసులో కూడా ఆమెకి సమస్యలు ఎదురవుతూనే వున్నా వాటిని ఎదుర్కొనేలాగా ఎదని నిబ్బరం చేసుకుంది నాణ్య.

మగజాతి అంటే ఆమె మదినిండా కసి పేర్కొని పోయింది. మగపిల్లాడి తల్లితండ్రులన్నా మనసు మండిపోసాగింది.

ఇలా వుండగా ఓ రోజు తన కొలీగ్‌తో కలిసి ఒకావిడ ఆఫీసుకు వచ్చింది. కొలీగ్ ప్రేమ ఆమెని నాణ్యకి పరిచియం చేసింది.

ముగ్గురూ క్యాంటీన్‌లో కూర్చున్నారు. ప్రేమ గలగలా మాట్లాడుతోంది. వచ్చిన బంధువు కూడా నవ్వుతూ మాట్లాడుతోంది. నాణ్య మాత్రం ముభావంగా వుండిపోయింది. ఆమెకి ఎవరితో మాట్లాడాలన్నా భయం. తన వివాహాన్ని గూర్చో లేక ఆధునిక మహిళల విచ్చలవిడితనాన్ని గూర్చో వాళ్లు మాట్లాడతారన్నది నాణ్య అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యం.

కానీ ఆవిడ నాణ్యని గురించి ఏమీ అడగలేదు. వెళుతూ వెళుతూ ఆమె చేతికి ఒక కవర్ ఇచ్చి వెళ్లిపోయింది.

నాణ్యకి ఆమె ఆకవర్ తనకి ఎందుకు ఇచ్చిందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

రాత్రి తల్లీ తండ్రీ పడుకున్నాక తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొని కవర్ తెరిచింది. అందులోంచి ఓ కాగితం బయటపడింది. దాన్ని చేతుల్లోకి తీసుకుంది నాణ్య. అందులోని అక్షరాలు ఉత్తరం రాసిన వ్యక్తి మనోగతాన్ని నాణ్య ముందుకు తెచ్చాయి

నాణ్యా,

నేనివాళ ప్రేమ దగ్గరికి రావడానికి కారణం ఏమిటో తెలుసా? నిన్ను చూడడానికే వచ్చానమ్మా. నేను ఒక మగపిల్లాడి తల్లిని. నా కొడుకు చక్కగా కాపురం చేసుకొని పిల్లాపాపలతో కళకళలాడాలని కాంక్షించే తల్లిని. ఆ కాంక్షతోనే వాడికి చదువు, సంధ్యా, ఉద్యోగం చూడచక్కని అందం వున్న అమ్మాయిని ఏరికోరి నేను ఎంచి పెళ్లిచేసాను.

జంట బాగుందని అందరూ మెచ్చుకున్నారు. ఆ జంటని మొదటిరాత్రి అట్టహాసానికి, అందరి అల్లరికీ దూరంగా ఉంచాలని పెళ్లి జరిగిన రోజే హనీమూన్‌కి పంపేసాము.

కానీ వెళ్లిన మర్నాడే మా అబ్బాయి చిన్నబోయిన ముఖంతో తిరిగి వచ్చేశాడు.

ఆ అమ్మాయి ఎవరినో ప్రేమించిందట. ఆ పెళ్లికి ఆమెని కన్నవారు ఒప్పుకోక ఇంట్లోనే బంధించి ఈ పెళ్లి చేసారుట. దాంతో ఆమె నా కొడుక్కి తన సంగతి చెప్పిందట. తర్వాతాపిల్ల తన ఒంటిమీది నగలు, తను తెచ్చుకున్న డబ్బుతో ప్రేమించినవాడితో కలిసి ఎటో వెళ్లిపోయిందట.

తిరిగి వచ్చిన వాడిని గురించి అందరూ నవ్వుతూ మాట్లాడుకోవడం నాకు చాలా బాధనిపించింది. మునపటి కాలంలో మగవాళ్లే విలన్లు. కానీ ఈ కాలంలో టీవీ ప్రభావం వల్లో మరి దేనివల్లో కానీ ఆడవాళ్లు కూడా విలన్లుగా మారిపోతున్నారు.

వీడికే ఏదో లోపం వుండి వుంటుంది. ఈ కాలం పిల్ల కదా అందుకే వదిలేసి వుంటుంది అని అందరూ చెవులు కొరుక్కోసాగారు. దాంతో వాడు డిప్రెషన్‌కి లోనయ్యాడు. ఉద్యోగానికి రాజీనామా చేసాడు. వాడికి మార్పుగా వుంటుందని వేరే ఊళ్లో ఉద్యోగం కోసం అప్లయ్ చేస్తే మంచిదని నేనూ మావారు అనుకున్నాం. ఇక్కడికి ఇంటర్వ్యూ కోసమే వచ్చాం. వాడు జాబ్‌లో సెలక్ట్ అయ్యాడని తెలిసింది.

వాడికో ఇల్లు చూసి వస్తువులు అమర్చి పెట్టాను. ఇంక తిరిగిపోవాలి అనుకుంటున్న సమయంలో ప్రేమ నీ గురించి చెప్పింది. నీ విషయం విన్నాక నువ్వు మావాడికి తగిన అమ్మాయివని అనిపించింది.

గాయపడిన మీరిద్దరూ ఒకరి ప్రేమతో మరొకరు కోలుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించగలరు అనిపించింది.

నాణ్యా చెడ్డతనం, మోసం చేసే తత్వం మగవారికే పరిమితమైనవి కావమ్మా! ఆతత్వాలు ఆడవారిలో కూడా వుంటాయని నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానమ్మా. నువ్వు ఇంకేమి ఆలోచించకుండా నీ జీవితాన్ని సుఖమయం చేసుకో. రాత్రిసరిగ్గా పదిగంటలకు నీ సెల్‌కి ఫోన్ చేస్తాను. నువ్వు ఫోన్ అందుకున్నావంటే ఈ పెళ్లికి ఒప్పుకున్నట్లే అనుకుంటాను. లేదా మావాడి బాడ్‌లక్ అనుకుంటాను.

బై...

సావిత్రి

నాణ్య సెల్‌వైపే చూస్తూ కూర్చుంది. అది మోగితే అందుకోవాలన్న తహతహ ఆమె కళ్లలో కనపడ్తోంది.

★

